

నవజాత శిశు సంరక్షణపై శిక్షణ

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువుల సంరక్షణపై నర్సింగ్ ఆఫీసర్లు, మహిళా సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సంధ్య, డాక్టర్ మనీషా, జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీజర్ విమల పలు విషయాలు తెలిపారు. సొసైటీ ఆఫ్ మిడ్ వైఫ్ ఇండియా ఆధ్వర్యంలో, వెల్నెస్ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీవో డీటీటీ డాక్టర్ ఉమాశ్రీ, డెమో రాజగోపాల్ పాల్గొన్నారు.

జిల్లాలో ఆరు సీసీఐ కొనుగోలు కేంద్రాలు

కరీంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఆరు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభించినట్లు జిల్లా మార్కెంటింగ్ అధికారి ఎండీ షాహబొద్దీన్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో జిన్నింగ్ మిల్లుల వివరాలు వెల్లడించారు. ఎలబోతారంలోని శక్తి మురుగన్ ఇండస్ట్రీస్, జమ్మికుంటలోని వైభవ్ కాటన్ కార్పొరేషన్ (ఆదిత్య కాటన్ ఆయిల్ ఆగ్రోటెక్ ఇండస్ట్రీస్), నరసింహ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్, సరిత కాటన్ ఇండస్ట్రీస్, సీతారామ కాటన్ ఇండస్ట్రీస్, వెలిచాలలోని కావేరి జిన్నింగ్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కొనుగోళ్లు చేపట్టనున్నట్లు తెలిపారు. పత్తి రైతులు తప్పని సరిగి కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని సీసీఐకి విక్రయించేందుకు పంటను తీసుకురావాలని సూచించారు. పత్తిలో ఎనిమిది శాతం తేమ మించకుండా చూసుకోవాలని, సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

బాలికలకు ఏదీ భద్రత?

- కలవరం కలిగిస్తున్న కురిక్యాల ఘటన
- పాఠశాల బాత్రూమ్‌లో రహస్యంగా వీడియో చిత్రీకరణ
- ఆందోళనలో విద్యార్థినుల తల్లిదండ్రులు
- నిందితుడి అరెస్టు.. పోక్సో కింద కేసు నమోదు
- ప్రధానోపాధ్యాయురాలి సస్పెన్షన్
- ఉపాధ్యాయులందరికీ షోకాజ్ నోటీసు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

గంగాధర మండలం కురిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దారుణ ఘటన చోటు చేసుకున్నది. పాఠశాలలో బాలికలు వాష్‌రూమ్‌లో ఉన్న సమయంలో ఆ పాఠశాలకు చెందిన ఆఫీసు సబార్డినేట్ రహస్యంగా వీడియోలు చిత్రీకరించడమే కాకుండా వాటి ఆధారంగా బ్లాక్‌మెయిల్ చేస్తూ లైంగిక వేధింపులకు గురి చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన విద్యార్థుల తల్లిదండ్రులనే కాకుండా అందరిని కలవరపరుస్తున్నది. సంఘటనను సీరి యస్‌గా తీసుకున్న కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్‌ఆలం స్పందించి నిందితుడిని కటకటాల వెనక్కి పంపించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమలను సస్పెండ్ చేసి ఉపాధ్యాయులందరికీ షోకాజు నోటీసులు జారీ చేశారు. నిందితుడు ఆఫీసు సబార్డినేట్ యాకూబ్ పాషాను సస్పెండ్ చేసి పోక్సో కేసు అరెస్టు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

వారం క్రితమే వెలుగులోకి వచ్చినా..

వేధింపుల విషయం వారంరోజుల క్రితమే వెలుగులోకి వచ్చినా విషయం బయటకి వస్తే పాఠశాల పరువు పోతుందని, తాము కూడా బాధ్యులం కావలసి వస్తుందని ప్రధానోపాధ్యాయురాలు ఫిర్యాదు చేయలేదని సమాచారం. బాధిత బాలికలు తమ తల్లిదండ్రులకు విషయం తెలపడంతో వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ పమేలాసత్పతి, సీపీ గౌస్‌ఆలంతో చర్చించి సున్నితమైన అంశం కావడంతో రహస్యంగా విచారణ జరిపించారు. సబార్డినేట్ యాకూబ్ భాషా కొద్దిరోజులుగా బాధిత విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, శరీర భాగాలను తాకుతూ వారి ఫొటోలు మార్ఫింగ్ చేశానని బెదిరించాడని ఫిర్యాదు వచ్చింది. కలెక్టర్ బాలికలు, మహిళా సంక్షేమ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మండల విద్యాధికారి, ఎంపీడీవోను పాఠశాలకు పంపించి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వారు జరిపిన విచారణలో ఫిర్యాదులో పేర్కొన్న అభియోగాలు నిజమని తేలడంతో ఈనెల 27న సాయంత్రం ప్రధానోపాధ్యాయురాలు ద్వారా గంగాధర పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. పోక్సో, ఐటీ, బీఎన్ఎస్ చట్టాల్లోని సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కరీంనగర్ రూరల్ అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. వారి విచారణలో కూడా లైంగిక వేధింపులు, ఇతర అభియోగాలు నిజమని తేలడంతో మంగళవారం కరీంనగర్ రేకుర్తి చౌరస్తా వద్ద నిందితుడు యాకూబ్ బాషాను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. యాకూబ్ బాషాను కేసు నమోదైన వెంటనే సస్పెండ్ చేశారు. విచారణ జరిపిన అధికారుల బృందం ప్రధానోపాధ్యాయురాలు కమల జరిగిన సంఘటనను దాచిపెట్టాల్సిందిగా పాఠశాల సిబ్బందిని బెదిరించారని, విద్యార్థినుల భద్రతను విస్మరించారని, జరిగిన సంఘటన ఉన్నతాధికారులకు తెలపకుండా వాస్తవాలను దాచారని నివేదికలో పేర్కొనడంతో ఆమెను కలెక్టర్ విధులను తప్పిస్తూ సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అమలులో ఉన్నంత కాలం ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లవద్దని ఆదేశించారు. పాఠశాలలో పనిచేస్తున్న మిగతా ఉపాధ్యాయులందరికీ షోకాజ్ నోటీసు జారీచేశారు. పాఠశాల ఉపాధ్యాయులతోపాటు సిబ్బంది అందరినీ మూకుమ్మడిగా బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. లైంగిక వేధింపుల ఘటనలో పాత్ర ఉన్నట్లు తేలితే ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిపై

(మిగతా 8వ పేజీలో)

నిందితుడిని రిమాండ్‌కు తరలించాం

- సీపీ గౌస్‌ఆలం

పాఠశాలలో బాలికలతో అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో పాఠశాలలో పనిచేస్తున్న ఆఫీసు సబార్డినేటర్ యాకూబ్‌భాషాను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసు కమిషనర్ గౌస్‌ఆలం తెలిపారు. ఈ ఘటనపై మరింత సమగ్రంగా విచారణ జరిపించి సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నామని, ఈ ఘటనతో సంబంధం ఉన్న అందరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. చాలా రోజులుగా జరుగుతున్న ఈ ఘటన వివరాలను ఉన్నతాధికారులకు తెలుపక పోవడం కూడా నేరంలో భాగం పంచుకున్నట్లుగానే పరిగణించి వారిపై కూడా చట్టపరమైన చర్యలుంటాయని అన్నారు. ఇలాంటి ఘటన జరిగితే వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి, ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలని సూచించారు.

నిందితులెవరైనా వదిలిపెట్టొద్దు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కురిక్యాల పాఠశాలలో బాలికల లైంగిక వేధింపుల ఘటనలో నిందితులెవరైనా వదిలిపెట్టకుండా కఠినంగా శిక్షించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలెక్టర్, పోలీసు కమిషనర్‌కు సూచించారు. దేవాలయం లాంటి పాఠశాలలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం విచారకరమని, సమగ్ర విచారణ జరిపించి బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాలికల భద్రతపై నిర్లక్ష్యాన్ని సహించబోం....

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ళ శారద

విద్యాసంస్థల్లో చదువుకునే బాలికల భద్రత, గౌరవంపై నిర్లక్ష్యాన్ని ఏ రూపంలోనూ సహించబోమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద స్పష్టం చేశారు. జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై అటెండర్ అనుచిత ప్రవర్తను ఆమె మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. విద్యాసంస్థలు విద్యార్థినుల భవిష్యత్తు నిర్మాణంలో కీలకమైనవని, అవి స్వేచ్ఛాయుత, సురక్షిత, గౌరవప్రదమైన వాతావరణంలో ఉండాలన్నారు. విద్యార్థినులపై ఎలాంటి వేధింపులు, అనుచిత ప్రవర్తనను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, పోలీసు అధికారులు ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించేందుకు, జిల్లా యంత్రాంగం కళాశాలలు, విద్యాసంస్థలు, హాస్టళ్లలో తనిఖీలు చేపట్టి భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కేసు పురోగతిని మహిళా కమిషన్ పర్యవేక్షిస్తుందని, బాధిత విద్యార్థినులకు అన్ని విధాల సహకారం అందిస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.

బాధ్యులపై పోక్సో కేసు నమోదు చేయాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

7

రాజ్యాంగం, చట్టాలు దళితులకు వర్తించడం లేదు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఏబీవీపీ, బీజేపీ, బీఆర్ఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో



గంగాధరలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

గంగాధర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలో బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని విద్యార్థి, దళిత సంఘాలు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గంగాధర ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం, ఎంఈవోను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలోకి వెళ్లడానికి బీజేపీ మహిళా నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయని తెలపడంతో మూడు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. ఎంఈవో ప్రభాకర్‌రావు పాఠశాల వద్దకు చేరుకోగానే ఎంఈవోను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఎంఈవో మాట్లాడుతూ అటెం డర్ యాకూబ్ పాషాను సస్పెండ్ చేశామని, పోలీ సులు పోక్సో కేసు నమో దు చేశారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని సస్పెండ్ చేసి ఉపాధ్యాయులందరికి షోకాజు నోటీసులిచ్చామన్నారు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులందరినీ ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తామని తెలిపారు. అయినా శాంతించని ఆందోళన జిల్లా కలెక్టర్ రావాలని పట్టుబట్టారు. చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వారిని అరెస్టు చేసి కరీంనగర్ తరలించారు.

సర్దార్ @ 150 పాదయాత్ర విజయవంతం చేయాలి

- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే

గణేశ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మేరా యువభారత్ ఆధ్వర్యంలో 31 నుంచి నిర్వహించే సర్దార్ @ 150 పాదయాత్రను విజయవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే పిలుపునిచ్చారు. సోమవారం తన చాంబర్‌లో ఆమె జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్, హుజూరాబాద్‌లో నిర్వహించే పాదయాత్ర కు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

పాదయాత్రలో పాల్గొనే యువతీ యువకులకు, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పాదయాత్రకు సంబంధి ంచిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో మేరా యువ భారత్ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ ఎం వెంకటరాంబాబు, ప్రోగ్రాం అధికారి బి రవీందర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ వి శ్రీనివాస్, డీఐఈవో వి గంగాధర్ పాల్గొన్నారు.



గంగాధర మార్కెట్లో కొట్టుకు పోయిన ధాన్యం

వర్షానికి తడిసిన ధాన్యం

గంగాధర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడసింది. గంగాధర మార్కెట్ యార్డులో వర్షానికి దాన్యం కొట్టుకు పోయింది. మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన ధాన్యం రాసులు వర్షానికి తడిసి పోయాయి. కేంద్రాల్లో వర్షానికి ధాన్యంపై కప్పేందుకు టార్పలిన్లు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 15 రోజుల క్రితం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చామని, వర్షానికి తడవడంతో ఆరబోయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాలను ప్రారంభించిన అధికారులు తూకాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

దివ్యాంగుల పాఠశాలకు సహాయం అందజేస్తాం

- కలెక్టర్ పమేలా సత్పతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్వాతంత్ర సమయయోదుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పాఠశాలకు తమ వంతుగా సహాయ, సహకారాలు అందజేస్తా అని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మండలంలోని మహాత్మా నగర్ ఎల్ఎండీ కాలనీలోని మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి విద్యా శిక్షణ కేంద్రానికి 26 లక్షల రూపాయలతో శ్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ బస్సును అందజేసింది. ఆ బస్సును కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం ప్రారంభించారు. అనంతరం బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శ్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ వారు పిల్లలకు బస్సును మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 136 మందికి కంటి అద్దాలు, అవసరమైనా వారికి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ డిప్యూటి జనరల్ మేనేజర్ సీహెచ్ వెంకట్ రెడ్డి, బోర్డు డైరెక్టర్ తిరుమల, ఎస్కే మదార్, మానసిక వికలాంగుల పాఠశాల మేనేజింగ్ ట్రస్టీ బి వెంకటయ్య, ట్రెజరర్ కొమురు ఎల్లారెడ్డి, ట్రస్టీ గాజుల భగవాన్, పి మధుసూదన్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి సీడీపీవో శ్రీలత, పాఠశాల ఏవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

కొత్తవారికే లక్కు

- మూడో వంతు వైన్స్‌లు వారికే..
- అర కోటికిపైగా గుడ్‌విల్ డిమాండ్...
- ఒక గ్రూపులో 180 దరఖాస్తులకు రెండు షాపులే



కరీంనగర్ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల లైసెన్సీల కోసం సోమవారం నిర్వహించిన లాటరీలో మూడోవంతు షాపులు కొత్త వారికే దక్కాయి. జిల్లాలో 94 మద్యం దుకాణాలకు కలెక్టర్ సమక్షంలో నిర్వహించిన లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపికచేశారు. ప్రస్తుతం వైన్స్, బార్లు నిర్వహిస్తున్న మద్యం వ్యాపారులు పోటాపోటీగా దరఖాస్తు చేశారు. రెండు దశాబ్దాలుగా మద్యం వ్యాపారంలో ఉన్న పలువురు బడా వ్యాపారులు వారి అనుచరులు, బంధువులను కలుపుకుని గ్రూపులుగా ఏర్పాటై వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. వారు ఆశించిన స్థాయిలో, ఆశించిన ప్రాంతాల్లో మద్యం దుకాణాలు దక్కలేదు. కరీంనగర్‌లో ఒక బడా వ్యాపారి ఐదు కోట్లకుపైగా వెచ్చించి 180 వరకు దరఖాస్తు చేయగా లాటరీలో అతనికి రెండు షాపులే లభించినట్లు తెలిసింది. మరో గ్రూపునకు చెందిన మద్యం వ్యాపారి 250 వరకు దరఖాస్తులు చేయగా ఆ గ్రూపునకు 11 షాపులు దక్కినట్లు సమాచారం. వేరొక గ్రూపునకు చెందిన వ్యాపారులు 150 వరకు దరఖాస్తులు సమర్పించగా వారికి రెండు షాపులే వచ్చాయి. మరికొన్ని గ్రూపులు 50 నుంచి 100 వరకు దరఖాస్తులు చేయగా వారికి కూడా ఆశించిన స్థాయిలో షాపులు లభించలేదని తెలుస్తోంది.

వాటాల కోసం ప్రయత్నాలు

షాపులు దక్కని మద్యం వ్యాపారులు కొత్తగా లైసెన్స్‌లు పొందినవారిని మచ్చిక చేసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. వారిని మచ్చిక చేసుకుని మద్యం దుకాణంలో కొంత వాటా కోసం అప్పుడే ప్రయ త్నాలు ప్రారంభించారు. కరీంనగర్‌తోపాటు పలు పట్టణాలలో ప్రస్తు తం నడుస్తున్న మద్యం దుకాణాలు వారి అడ్డాలను వదులు కోకుండా కొత్త దుకా ణంలో వాటా కోసం బేరాలు సాగిస్తు న్నారు. కొత్తగా లైసెన్స్ వచ్చిన వారికి 25 నుంచి 30 లక్షల వరకు గుడ్‌విల్ ఆఫర్ చేస్తున్నారు. కరీంనగర్‌లో కొత్తగా వైన్‌షాపు దక్కించుకున్న ఒక వ్యక్తి తనకు 70 లక్షలు గుడ్ విల్ ఇస్తేనే షాపును అప్పగిస్తానని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

- జిల్లాలో 94 వైన్‌షాపులకు 2,730 దరఖాస్తులలురాగా ఇందులో అత్యధికంగా కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 21 వైన్‌షాపులకు 794 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ రూరల్‌లోని 26 వైన్‌షాపులకు 788, తిమ్మాపూర్‌లోని 14 వైన్‌షాపులకు 469, హుజూరాబాద్‌లోని 17 వైన్‌షాపులకు 357, జమ్మికుంటలోని 16 వైన్‌షాపులకు 322 దరఖాస్తులు వచ్చాయి.

ఒకే కుటుంబానికి మూడు దుకాణాలు

కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన పాక దయానంద్ అతని భార్య, కూతురికి మూడు వైన్ షాపులు దక్కాయి. దయానంద్‌కు కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గెజిట్ నంబరు 33, ఆయన భార్య పాక సుమనదేవికి కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గెజిట్ నంబరు 6, కూతురు పాక రిషితకు గెజిట్ నంబరు 21 షాపు వచ్చింది.

వృద్ధురాలి ఆత్మహత్య


వీరలక్ష్మి (ఫైల్)

మంథని, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో సిరిపురం వీరలక్ష్మి (70) అనే వృద్ధురాలు మంగళవారం ఇంట్లో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వీరలక్ష్మి పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్, హైదరాబాద్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడం, నడవలేని స్థితిలో ఉండటంతో జీవితంపై విరక్తి చెందింది. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ఇంట్లో తలుపులు, దర్వాజాలకు ఉపయోగించే రంగులను కడగటానికి తెచ్చిన పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు వీరశంకర్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించినట్లు తెలిపారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీలు

- 5 వాహనాలు సీజ్, రూ. 60వేల జరిమానా


రేణికుంట టోల్‌గేట్ వద్ద ఆర్టీఏ అధికారుల వాహన తనిఖీలు

తిమ్మాపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి 5 వాహనాలను సీజ్ చేసి 1 బస్సుకు జరిమానా విధించారు. ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్‌గేట్ వద్ద రాజీవ్ రహదారితో పాటు చొప్పదండి ప్రాంతాల్లో ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి ఆధ్వర్యంలో రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. హైదారాబాద్ నుంచి ఛత్తీస్‌ఘడ్‌కు వెళ్తున్న కాంట్రాక్ట్ క్యారేజ్ బస్‌లో నిబంధనలు పాటించకపోవడంతో జరిమానా విధించారు. అంతేకాకుండా టాక్సులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్‌తో పాటు ఇతర ధ్రువపత్రాలు లేని రెండు ట్రాక్టర్లు, రెండు లైట్ గూడ్స్ వాహనాలు, ఒక కారు మొత్తం ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవిఐ రవికుమార్, ఏఎంవిఐ హరిత సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు ఆన్‌లైన్ సేవలు ఎలా ఉపయోగించుకోవాలి?

● ఐఎఫ్ఎమ్ఐఎస్ యాప్ వల్ల ఉపయోగాలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఆన్‌లైన్ సేవలు ఉపయోగించుకోవాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సివి జీవన్‌రాజు తెలిపారు. అక్టోబర్ పెన్షన్లు యథావిధిగా జమ అవు తాయి. ఈ విషయంలో పెన్షనర్లు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఐఎఫ్ఎంఐఎస్ యాప్ గురించి ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) యాప్‌లో పెన్షనర్లు నమోదు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వంలో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల పేర్లు, హోదా, ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయని వారి జీతాలు అక్టోబరు నుంచి నిలిపి వేయాల్సిందిగా ఆర్థిక శాఖ నుంచి ట్రెజరీ డైరెక్టర్‌కు ఆదేశాలు అందాయి. ఇది కేవలం ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది.

● ఐఎఫ్ఎంఐఎస్ వల్ల ఉపయోగాలు

ఇది జీతాలు, పెన్షన్లు తదితర వాటి చెల్లింపులను వేగవంతం చేస్తుంది. చెల్లింపుల్లో పారదర్శకత ఉంటుంది. ఐఎఫ్ఎమ్ఐ యాప్ ద్వారా తమకు వచ్చే పెన్షన్ పే స్లిప్పులను, సవివరంగా, సులభంగా తెలుసుకోవచ్చు. అంతేకాక దీనిలోని ప్రొఫైల్ ద్వారా మన వ్యక్తిగత కుటుంబ వివరాలు ప్రభుత్వం వద్ద



ఉన్నవి తెలుసుకోవచ్చు. ఈ యాప్ పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ వంటి సేవలను అందిస్తుంది. ప్రభుత్వం ఆర్థిక నిర్వహణ ప్రక్రియ ఆటోమేట్ చేయడానికి, ఆర్థిక సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగించే కంప్యూటర్ ఆధారిత వ్యవస్థ. రాష్ట్రంలో ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు తదితరాలు అన్నీ దీని ద్వారానే నిర్వహిస్తున్నారు.

● ఆన్‌లైన్‌లో నమోదు ఇలా

స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఐఎఫ్ఎమ్ఐఎస్ పెన్షనర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎనిమిది అంకెల పీపీవో ఐడితో లాగిన్ అవ్వాలి. సెల్‌ఫోన్‌కు నాలుగు అంకెల ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేయగానే మన పేరు వస్తుంది. దాని కింద రెండు గదులు ఉంటాయి. దానిలో నాలుగు అంకెల పాస్‌వర్డ్ నింపి సబ్‌మిట్ చేయాలి. నెల వారీగా మనం తీసుకుంటున్న పదేళ్ల వివరాలు వస్తాయి. సెల్‌ఫోన్ పైభాగాన ఎడమవైపు ఆకుపచ్చ రంగుల వ్యూ ప్రొఫైల్ అని ఉంటుంది. దానిలో స్పౌజ్ పేరు, పుట్టిన తేది, బ్యాంక్ అకౌంట్ నెంబర్ వివరాలు వస్తాయి. సెల్‌ఫోన్ పైభాగాన కుడివైపు లోగో పక్కన మూడు అడ్డుగీతలు ఉంటాయి. వాటిని తాకితే తొమ్మిది రకాల ఐఎఫ్ఎమ్ఐఎస్ సేవలు వస్తాయి. అందులో ముఖ్యమైనవి, పెన్షన్ పేస్లిప్, లైఫ్ సర్టిఫికేషన్ తాకితే వీడియో రికార్డింగ్ ద్వారా మనం ప్రతీ సంవత్సరం నవంబరు నుంచి మార్చి వరకు ఇచ్చే లైఫ్ సర్టిఫికెట్ నేరుగా మన ట్రెజరీ అధికారులకు ఇవ్వవచ్చు. ఈ లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ ద్వారా డిజిటల్‌లో ఇవ్వవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే మొబైల్ నంబర్ 9849204085కు సంప్రదించాలని తెలిపారు.

బాలికలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

- పోక్సో కేసులో నిందితుడి అరెస్టు
- కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మైనర్లతో పాటు అమ్మాయిలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థినులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసే మహిళలు వేధింపులు, లైంగిక దాడులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో ఆఫీస్ సబార్డినేట్/అటెండర్‌గా పనిచేస్తున్న గీసుకొండ మండలం శాయంపేటకు చెందిన మహ్మద్ యాకూబ్ పాషా(30) మైనర్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో పోక్సో కేసు నమోదు చేశామని, నిందితుడిని మంగళవారం రేకుర్తిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితుడు బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా చైల్డ్, మహిళా వెల్ఫేర్ అధికారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సదరు పాఠశాలలో విద్యార్థినుల నుంచి సమగ్ర వివరాలు సేకరించారని తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న అభియోగాలు నిజమేనని అధికారుల కమిటీ విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడి చేసినట్లు విచారణలో నిర్ధారణ అయినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై బీఎన్ఎస్ పోక్సో ఐటీ చట్టాల్లోని కఠినమైన సెక్షన్లలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భార్యను హింసిస్తున్న వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను హింసిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆరెపల్లి గ్రామానికి చెందిన సత్తినేని కరుణాకర్ నిత్యం మద్యం తాగుతూ కటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. రోజూ తాగి వచ్చి భార్యను కొడుతున్నాడు. గత నెల 15న కరుణాకర్ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యను విపరీతంగా కొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు నిందితుడిని అరెస్టు చేశారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ వరద గేట్లు

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం పెరగడంతో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సోమవారం గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 22,154 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,000 క్యూసె క్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 573 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. కాగా ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 886.509 టీఎంసీ నీరు రాగా, 818.796 టీఎంసీల నీరును వదిలారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చందుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 13 మందికి గాయాలయ్యాయి. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన భక్తుల టాటాఏస్ వాహనం, రుద్రంగి చెందిన కారు చందుర్తి మండలం లింగంపేట-మల్యాల గ్రామాల మధ్య వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. టాటా ఏస్ నడుపుతున్న కథలాపూర్ మండలం కలికోట గ్రామం చెందిన డ్రైవర్ రాజుకు కాలు విరగడంతో పాటు తలకు తీవ్ర గాయం కాగా, రుద్రంగి చెందిన లచ్చవ్వ, లక్ష్మి, దేవలక్ష్మి, రత్నమ్మలకు తలకు, కాళ్లకు గాయాలైనట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పంగా గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం చందుర్తి రుద్రంగి చెందిన 108అంబులెన్స్‌లో పైలెట్లు నరేందర్, చాణక్య, ఈఎంటి గణేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని వేములవాడలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ జరుపుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులు

బీఎస్సీ, హానర్స్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడదల

గణేశ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో 1,2,3వ సెమిస్టర్, బయో మెడికల్ సైన్స్ కోర్సులో 1,3వ సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్ శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. పరీక్షలు నవంబర్‌లో ఉంటాయని తెలిపారు. వచ్చే నెల 4వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని, 300 రూపాయల అపరాధ రుసుముతో 10వ తేదీలోగా అనుమతి ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

గుడిసె దగ్ధం


దగ్ధమైన వస్తువులు

గంబీరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గంబీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో గుగులోత్ రాజునాయక్‌కు చెందిన గుడిసె దగ్ధమైంది. షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రమాదంలో ఇంట్లో సామగ్రితో పాటు సరుకులు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.90వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వపరంగా బాధితుడికి సహాయం అందించాలని గ్రామస్థులు కోరారు.

ఒకరిపై దాడి కేసు నమోదు

రామగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్ గ్రామానికి చెందిన గోగుల మహేందర్ అనే వ్యక్తిపై కేసు నమోదైంది. అదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో గల రూ. 50వేల నగదుతో పాటు టీవీ ధ్వంసం చేసినట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అజ్ఞాతం వీడిన చంద్రన్న

- ఆయుధాలు లేకుండానే రాష్ట్ర డీజీపీ ఎదుటకు
- 45 ఏళ్ల అజ్ఞాతానికి స్వస్తి పలికి జనజీవన స్రవంతిలోకి
- దళ సభ్యుడి నుంచి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు ప్రస్థానం
- అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి ఇంటి ముఖం చూడని చంద్రన్న

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి/జూలపల్లి)

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఒక్కొక్కరుగా లొంగుబాట పడుతున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన పార్టీ కీలక నేత పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ, అభయ్ 62 మంది మావోయిస్టులతో కలిసి ఆయుధాలతో లొంగిపోయారు. మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట జిల్లాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు (65) అలియాస్ చంద్రన్న అలియాస్ శంకరన్న 45 ఏళ్ల అజ్ఞాతం వీడి ఆయుధాలు పార్టీకి అప్పగించి లొంగిపోయారు. ఇది మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బేనని చెప్పవచ్చు. ప్రసాదరావుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 25 లక్షల రూపాయల రివార్డును అందజేశారు.


పుల్లూరి ప్రసాదరావు చదువుకున్న వడుకాపూర్ ప్రభుత్వ పాఠశాల


పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న(ఫైల్)

● ఆర్ఎస్‌యూ నుంచి అజ్ఞాతంలోకి..

జూలపల్లి మండలం వడుకాపూర్ చెందిన పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న 45 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నారు. 1961లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుల్లూరి శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా ప్రసాదరావు జన్మించారు. ఆయనకు ఇద్దరు సోదరులు అశోక్ రావు, తిరుపతి రావు, ఒక సోదరి ఉన్నారు. ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు రామగుండంలో నివాసం ఉంటున్నారు. తల్లిదండ్రులు మరణించగా గ్రామంలో సొంత ఇల్లు శిథిలావస్థకు చేరి నేలమట్టమైంది. ప్రసాదరావు వడుకాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978లో పదో తరగతి చదివారు. 1979లో పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ చదువుతుండగా రాడికల్ స్టూడెంట్ యూనియన్ ఆర్గనైజర్‌గా వ్యవహరించిన దగ్గు రాజలింగుతో చంద్రన్నకు పరిచయం ఏర్పడింది. రాజలింగు విప్లవ బోధనలతో ప్రభావితుడైన చంద్రన్న ఆర్ఎస్‌యూలో చేరి విప్లవ పంథా వైపు అడుగులు వేశారు.

● కిషన్‌జీకి కొరియర్‌గా పని చేస్తూ..

1980లో ఇంటర్ పూర్తి చేసిన చంద్రన్న మల్లోజుల కోటేశ్వర్ రావు అలియాస్ కిషన్‌జీకి కొరియర్‌గా పని చేస్తూ హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తున్న కేఎస్ గ్రూపు నాయకుల మధ్య సమాచారాన్ని చేరవేసే వారు. సీపీఐ పీపుల్స్ వార్ గ్రూప్ మరో నేత మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ అలియాస్ మీసాల రాజిరెడ్డి దండకారణ్యంలో పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తుండగా, ఆయన నేతృత్వంలోని సాయధ దళంలో చేరారు. చంద్రన్నతో పాటు మరో ఇద్దరిని 1980 జూలైలో ఛత్తీస్ గఢ్‌లోని బీజాపూర్ జిల్లా భూపాలపట్నం పోలీసులు అరెస్టు చేశారు. జగ్దల్‌పూర్ జైలులో ఉన్న చంద్రన్న అదే సంవత్సరం డిసెంబరులో బయటకు వచ్చి ఇంటికి చేరారు. తర్వాత కొద్ది రోజులకే అజ్ఞాతంలోకి వెళ్లి ఆసిఫాబాద్ దళంలో సభ్యుడిగా పనిచేశారు. 1981లో పీపుల్స్ వార్ ఆవిర్భావం తరువాత సిర్పూర్ దళ కమాండర్‌గా 1983లో బాధ్యత లు చేపట్టారు. 1987 వరకు దళ కమాండర్‌గా పనిచేసిన ఆయన డివిజనల్ కమిటీ సభ్యుడిగా బాధ్యతల్లో సిర్పూర్, చెన్నూరు ప్రాంత దళాల ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కమిటీ కార్యదర్శిగా వ్యవహరించిన చంద్రన్న 1995లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ కార్యదర్శిగా వ్యవహరించిన ఈ కమిటీలో చంద్రన్నతో పాటు జినుగు నర్సింహారెడ్డి అలియాస్ జంపన్న, నందె రాజమౌళి అలియాస్ ప్రసాద్‌లు సభ్యులుగా పనిచేశారు. 2006 వరకు కమిటీలో చంద్రన్నతోపాటు ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఇన్‌చార్జిగా వ్యవహరించిన చంద్రన్న 2007లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

● 2008 నుంచి కేంద్ర కమిటీ సభ్యుడిగా..

కేంద్ర కమిటీ ప్రత్యామ్నాయ సభ్యుడిగా వ్యవహరించిన చంద్రన్న 2008లో పూర్తి స్థాయిలో సీసీ కమిటీ సభ్యుడిగా చేరారు. 2021 జూన్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేసిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ మరణించడ ంతో ఆ బాధ్యతలను చంద్రన్న చేపట్టారు. 2024 డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ బాధ్యతలు బడే దామోదర్ అలియాస్ చొక్కారావుకు అప్పగించిన తరువాత సీసీ మెంబర్‌గా చంద్రన్న తెలంగాణ కమిటీకి మార్గదర్శిగా వ్యవహరించారు. చంద్రన్న 1989లో సిర్పూర్, చెన్నూర్ డివిజనల్ కమిటీ సభ్యురాలు కుర్సంగి మోతిబాయి అలియాస్ రాధక్కను వివాహం చేసుకున్నారు. 2013 జూన్‌లో రాధక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరెస్టు కాగా 2015లో బెయిల్‌పై వచ్చిన తరువాత నిర్మల్ ప్రాంతంలోని వారి స్వగ్రామంలో నివాసం ఉంటున్నారు. అజ్ఞాతంలోకి వెళ్లిన నాటి నుంచి ప్రసాదరావు ఇంటి ముఖం చూడలేదు. 17 ఏళ్లకు పైగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేసిన చంద్రన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు బాహ్య ప్రపంచంలోకి వచ్చారు. అనారోగ్య సమస్యలు కూడా వెంటాడుతుండడంతో ఆయన జనజీవన స్రవంతిలో కలిశారు.

పార్టీలో కొనసాగుతున్నది వీరే...

మంథని మండలం శాస్త్రులపల్లికి చెందిన మరో కేంద్ర కమిటీ సభ్యుడు మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, రామగుండం ప్రాంతానికి చెందిన డీసీఎం అప్పాసి నారాయణ అలియాస్ రమేష్, కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన రాష్ట్ర కమిటీ మెంబర్ కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్, పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్ గంగిడి సత్యనారాయణరెడ్డి అలియాస్ విజయ్, పాలితం గ్రామానికి చెందిన డివిజన్ కమిటీ మెంబర్ ఆలేటి రామలచ్చులు అలియాస్ రాయలచ్చులు, ఏరియా కమిటీ మెంబర్లు దాతు ఐలయ్య, వడ్కాపూర్ చెందిన ఢీకొండ శంకరయ్య అలియాస్ శేషన్న, సుల్తానాబాద్ మండలం కొదురుపాకకు చెందిన జువ్వాడి వెంకటేశ్వర్ రావు అలియాస్ ధర్మన్నలు పార్టీలో కొనసాగుతున్నారు.

మాది లొంగుబాటు కాదు..

- పుల్లూరి ప్రసాద రావు అలియాస్ చంద్రన్న

'మాది లొంగుబాటు కాదు అభివృద్ధిలో కలిసి పనిచేయడానికి వచ్చాం. ఇప్పటి వరకు ఉద్యమంలో పీడిత ప్రజల కోసమే పని చేశాను, భవిష్యత్తులో కూడా ప్రజల కోసమే పని చేస్తాను. మా సిద్ధాంతం ఓడిపోలేదు, ఓడించడం ఎవరి తరం కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. 'మా భావ జాలంతో భవిష్యత్తులో మరింత మంది ముందుకు వచ్చే అవకాశం ఉంది. ప్రజల మధ్య ఉండి సేవ చేయాలనుకున్నాను. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీని ఎన్నుకున్నారు. దేవ్‌జీని సపోర్ట్ చేస్తున్నాను. ఆయుధాలను పార్టీకి ఇచ్చి వచ్చాను.' అని ఆయన వెల్లడించారు. మావోయిస్టులు మా అన్నదమ్ములని సీఎం రేవంత్ పిలుపునివ్వడంతో ముందుకు వచ్చామని, జనంలో ఉంటూ జనం కోసం పని చేస్తామన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య


వెంకటరాజం(ఫైల్)

ధర్మారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంజేరుపల్లి గ్రామానికి చెందిన సొన్నాయిల వెంకటరాజం (67) అనే వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నేళ్లుగా నాటుసారాకు అలవాటు పడడంతో ఆరోగ్యం క్షీణించింది. దీంతో వెంకటరాజం మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలిపి సోమ వారం తాగగా చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. వెంకటరాజం భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

సిమ్స్‌లో చోరీ

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) జనరల్ ఆసుపత్రిలో కొన్ని రోజులుగా చోరీలు జరుగుతున్నాయి. పేషెంట్లుగా ఆసుపత్రికి వచ్చి మొబైల్స్ ఎత్తుకెళుతున్న రామగుండం చెందిన వెంకటేష్‌ను మంగళవారం సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. సోమవారం అర్ధరాత్రి కడుపునొప్పి అంటూ ఆసుపత్రిలో చేరిన వెంకటేష్ అతనికి ట్రీట్‌మెంట్‌లో కేర్ టేకర్‌గా ఉన్న రాజేష్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. అతని కదలికలు గమనించిన సెక్యూరిటీ సిబ్బంది రాజేష్ థియేటర్ కల్లు కాంపౌండ్ వద్ద మంగళవారం ఉదయం పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. జీఎం కాలనీకి చెందిన మదన్మోహన్ అనే వ్యక్తి రవీందర్ ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లడంతో అతడిని కూడా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాగా అతని మతిస్థిమితం సరిగా లేదని, అతను తన బైక్ అని మరో బైక్ తీసుకెళ్లినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

రాచపల్లిలో దొంగల హల్‌చల్

ఇల్లందకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు పలు ఇళ్లలో హల్‌చల్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో రికార్డు గది, ఆఫీస్ రూమ్‌లో చిందర వందర చేశారు. గ్రామంలోని సెలూన్ షాపులోని వస్తువులను కూడా పడేశారు. అదే విధంగా రెండు ఇళ్లలోని వస్తువులను కూడా చిందర వందర చేశారు. కాగా దొంగతనానికి వచ్చిన వ్యక్తి నల్ల సంచిలో డాక్యుమెంట్ పేపర్లు క్లాస్‌రూమ్‌లో మరిచి వెళ్లారు. ఎల్లమ్మ గుడిలో వస్తువులను చిందరగా పడేశారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ క్రాంతికుమార్ పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రాచపల్లిలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు కేశవపట్నం ఏఎస్ఐ సంపత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయగా వాటిని గుర్తించి పోగొట్టుకున్న మూడు మొబైల్ ఫోన్లను బాధితులైన చెంచాల శ్రీనివాస్, బుర్ర రవి, తోట అరవింద్‌లకు అందజేసినట్లు తెలిపారు. కాగా ఎవరైనా తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకుంటే వాటి వివరాలను వెంటనే మిస్సింగ్ మొబైల్ సీఈఐఆర్ పోర్టల్లో అప్లోడ్ చేయడం ద్వారా మొబైల్ గుర్తించవచ్చన్నారు. దీంతో తిరిగి స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేయడానికి అవకాశం ఉంటుందన్నారు.



సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఏఎస్ఐ సంపత్‌రెడ్డి

బద్ది పోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో సందడిగా మారిన బద్దిపోచమ్మ ఆలయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అనుబంధ బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున మట్టిపాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్నాలు వేసి ఒడిబియ్యం, నూతన వస్త్రాలను సమర్పించారు. అమ్మవారికి ఇష్టమైన కల్లుసాక పెట్టి చల్లంగా చూడాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు చర్యలు తీసుకున్నారు.

భక్తులకు అందుబాటులో ప్రసాదాల కౌంటర్లు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల్లో భాగంగా ప్రసాదాల కేంద్రాలను భీమశ్వర ఆలయం వద్దకు తరలించారు. నెల రోజులుగా భీమన్న ఆలయం ముందు వేద పాఠశాలలో కౌంటర్ నిర్మాణాలను చేపట్టారు. రాజన్న ప్రసాద విక్రయాల కౌంటర్ పనులు పూర్తి కావడంతో రెండు కౌంటర్‌లను సోమవారం భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

అంజన్న క్షేత్రంలో భక్తుల పూజలు



కొండగట్టులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మల్యాల, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం వేలాదిగా భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయంలో స్వామి వారికి మొక్కులు చెల్లించుకొని బేతాళుడు, రాముల వారి వద్ద కూడా పూజలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, నిత్య పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

వేములవాడలో శరవేగంగా బ్రిడ్జి పనులు



వేములవాడ మూలవాగుపై వేగంగా జరుగుతున్న బ్రిడ్జి పనులు



14 మీటర్ల లోతుకు పిల్లర్లు వేసేందుకు యంత్రాలతో జరుగుతున్న పనులు

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణం
- భక్తులకు తప్పనున్న ట్రాఫిక్ ఇబ్బందులు

వేములవాడ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ తిప్పలు తప్పేలా నిర్మిస్తున్న వంతెన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వేములవాడ మూలవాగుపై అప్పటి ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ. 28 కోట్లతో రెండు బ్రిడ్జిల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2018 సంవత్సరం వరకు రెండు వంతెనల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి వుంది. ఎడమ వైపు మొదటి బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయినప్పటికీ కుడివైపు బ్రిడ్జి నిర్మాణ దశలోనే కూలి పోయింది. బ్రిడ్జి నిర్మాణం ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండటంతో పాటు రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు, పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించడంతో వేగంగా ముందుకు సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం 190 మీటర్ల పొడవుతో మూలవాగుపై నిర్మిస్తున్నారు. బ్రిడ్జిపైన ఐదు స్లాబ్‌లు ఏర్పాటు చేయాల్సి వుంది. అయితే ఇప్పటి వరకు రెండు స్లాబ్‌లు పూర్తి అయినప్పటికీ మూడు స్లాబ్‌ల నిర్మాణం జరగాల్సి ఉంది. తిప్పాపూర్ బస్టాండు సమీపంలో మొదటి స్లాబ్, అమరవీరుల స్థూపం వద్ద చివరి స్లాబ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. పిల్లర్ల కోసం యంత్రాలతో 14 మీటర్ల లోతుతో పైల్స్ చేయడంలో కాంట్రాక్టర్ నిమగ్నమై ఉన్నారు. వచ్చే వర్షాకాలం వరకు భక్తులకు, పట్టణవాసులకు బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువస్తామని కాంట్రాక్టర్ చెబుతున్నాడు.

నిర్మాణ దశలోనే కూలిన బ్రిడ్జి

గతంలో మూలవాగుపై కుడివైపు నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ దశలోనే పలు మార్లు కూలిపోయింది. యేటా వర్షకాలం వస్తే చాలు బ్రిడ్జి కూలడం లేదా కుంగడం జరిగింది. రూ. 28 కోట్ల నిధులలో భూసేకరణ కోసం రూ. 7 కోట్లు సేకరించినట్లు అధికారులు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ కొరవడంతో భారీ వర్షాలు పడుతున్న సమయంలో పనులు చేసినట్లు కాంట్రాక్టర్‌లు ఆర్భాటం చేశారు. ఒక బ్రిడ్జి పనులు పూర్తి అయినా అప్పటి ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదని 2018లో కాంట్రాక్టర్ నిరసన తెలిపాడు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత శాఖ మంత్రి సహకారంతో పనులు జరిగేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారు. భూసేకరణ చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో కాంట్రాక్టర్‌లు పనుల్లో వేగం పెంచారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం

జమ్మికుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7 వేలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 115 మంది రైతులు 1,140 క్వింటాళ్ల విడిపత్తి, 22 మంది రైతులు 34క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7వేలు, కనిష్ఠ ధర రూ.5,400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఐదు మంది రైతుల నుంచి 51క్వింటాళ్ల పత్తి మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టింది. మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించారు.

ఐఐటీ మద్రాస్ నుంచి జంగపల్లి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

గన్నేరువరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐఐటి మద్రాస్ వారు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన డాటా సైన్స్ ఏఐ కోర్సు పూర్తి చేసి జంగపల్లి విద్యార్థులకు ఐఐటీ నుంచి ప్రశంసా పత్రాలు అందాయి. ఎనమిది వారాల ఆన్‌లైన్ స్కూల్ కాన్సెప్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శివసాయి, హాసిని నవలిక, భవాని, వర్షిణిలకు ఐఐటీ నుంచి ప్రశంసా పత్రాలు అందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శారద ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా ఆన్‌లైన్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు ఐఐటి మద్రాస్ నుంచి సర్టిఫికెట్‌లను అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు గైడ్ చేసిన టీచర్ వసుంధర, విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కొలనూరులో కొండచిలువ



కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని కొలనూరు గ్రామంలో కొంతసేపు కొండ చిలువ హల్‌చల్ చేసింది. కొలనూరు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ ఆవరణలో మం గళవారం రాత్రి కొండ చిలువ రావడంతో గ్రామ స్థులు భయాందోళన గురయ్యారు. దీంతో గ్రామస్థులు కొండచిలువను హతమార్చారు.

రాజ్యాంగం, చట్టాలు దళితులకు వర్తించడం లేదు

- 1న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

సుభాష్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, చట్టాలు దళితులకు వర్తించడం లేదని, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడిని నిరసిస్తూ నవంబరు 1న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 23 రోజుల క్రితం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేస్తే ఇంతవరకు అతడిపై చర్యలు తీసుకోలేదన్నారు. దేశంలో దళితులపై దాడులు జరిగితే వారికి రాజ్యాంగం, చట్టాలు సమానంగా పనిచేయడంలేదని ఆరోపించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కావడాన్ని అగ్రవర్ణాల వారు జీర్ణించుకోవడం లేదన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించినాటి నుంచి సుప్రీం కోర్టులో ఎస్సీ రిజర్వేషన్ అమలు కాలేదని, గవాయి బాధ్యతలు స్వీకరించిన తరువాత రిజర్వేషన్ అమలు చేశారని, దీనిని కూడా అగ్రవర్ణాలు జీర్ణించుకోవడం లేదని అన్నారు. బీఆర్ గవాయి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్న తరువాత మహారాష్ట్రలో అంబేద్కర్ గ్రామానికి వెళ్తే ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శితోపాటు డీజీపీ స్వాగతం పలకాలని, కానీ వారు రాలేదని, ఆనాడు వారిపై చర్యలు తీసుకుంటే ఈ దాడి జరిగేది కాదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చింది కూడా గవాయి అని, వర్గీకరణను వ్యతిరేకించేవారు కూడా ఈ ఘటనను ఖండించడం లేదని అన్నారు. దాడి జరిగిన తరువాత ఢిల్లీ పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదన్నారు. ఇటీవల నిజామాబాద్‌లో రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేస్తే 24 గంటల్లో స్పందించిన మానవహక్కుల కమిషన్, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగితే ఇంతవరకు స్పందించలేదని, సుమోటోగా కేసు స్వీకరించలేదని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంద రాజు, జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, బోయిని కొమురయ్య, బక్కి మురళికృష్ణ, చెంచాల నవీన్, కొత్తూరి రాజన్న, తడగొండ శంకర్, చిలుముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై పోక్సో కేసు నమోదు చేయాలి

- లైంగిక వేధింపుల్లో హెచ్‌ఎం, సిబ్బంది పాత్రపై విచారణ
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లైంగిక వేధింపులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి పోక్సో కేసు నమోదు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ఓ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం ఐదు రోజులుగా విచారణ జరిపారుపుతున్నారన్నారు. లైంగిక వేధింపుల విషయంలో హెచ్‌ఎం, సిబ్బంది పాత్రపై విచారణ కొనసాగుతోందన్నారు.

వారి పాత్ర ఉన్నట్లు తేలితే పోక్సో కేసు నమోదు చేసేందుకు వెనుకాడవద్దని ఇప్పటికే అధికారులకు చెప్పామన్నారు. లైంగిక వేధింపుల బాధ్యుడితో పాటు, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేశారన్నారు. పిల్లలకు భరోసా ఇవ్వడంతో పాటు, తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా అధికారులు భరోసా కల్పిస్తున్నారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వంగర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. నిర్బంధ విద్య కోసం ఇబ్బంది పెట్టకుండా విద్యార్థుల మానసిక పరిస్థితి తెలుసుకుని అందుకు అను గుణంగా బోధించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆత్మహత్యలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా పరిస్థితి మారలేదన్నారు. ప్రభుత్వ గురుకులాలు, వసతి గృహాలను గాలికి వదిలి వేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో మొంథా తుఫాన్ ప్రభావం వల్ల తెలుగు రాష్ట్రాలకు భారీ, అతి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తరుపున అన్ని రకాల సహాయక చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశామన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని19జిల్లాల్లో వర్షం ప్రభావం భారీగా ఉన్నందున ఇప్పటికే ఆ రాష్ట్రానికి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు పంపించామన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామన్నారు. తెలంగాణలోనూ పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశ మున్నందున ఆయా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రం తరుపున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కొనుగోలు కేంద్రానికి స్థలం ఏర్పాటు చేయాలి



బొమ్మనపల్లిలో రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా

చిగురుమామిడి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రానికి గ్రామంలో స్థలం ఏర్పాటు చేయాలని బొమ్మనపల్లిలో గ్రామ రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. దీంతో హుజూరాబాద్- హుస్నాబాద్‌కు వెళ్లే వాహనాలు నిలిచిపోయి రవాణాకు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వ భూమి కేటాయించాలని యేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో గత్యంతరం లేక నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ మద్దసాని రమేష్, ఎస్సై సాయికృష్ణ గ్రామానికి వచ్చి రైతులతో మాట్లాడారు. స్థలాన్ని పరిశీలించారు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, గ్రామ రైతు ఐక్య వేదిక నాయకులు, అన్ని పార్టీల గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

భూమి చదును చేస్తుండగా పురాతన నాణేలు లభ్యం

- పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పెద్దపల్లి, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండలం చీమలపేటలో ఇంటి స్థలాన్ని చదును చేస్తుండగా లభించిన పురాతన కాలం నాటి 10 నాణేలను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాణేలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమలపేటకు చెందిన తొంటి రాజు అతని 7 గుంటల ఇంటి స్థలాన్ని ఈ నెల 25న ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా పురాతన కాలం నాటి 10 నాణాలు బయట పడ్డాయన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే జూలపల్లి ఎస్ఐ రెవెన్యూ అధికారులతో విచారణ జరిపారని, రాజు వద్ద ఉన్న 10 నాణేలు గుర్తించి నగల తయారీ వ్యక్తి వద్ద పరీక్షించారన్నారు. అవి వెండి, రాగి, ఇత్తడి లోహాలతో తయారు చేసిన నాణాలుగా నిర్ధారించారని తెలిపారు. నిర్ధారించిన నాణాలు 111.50 గ్రాముల బరువు ఉన్నాయని, వాటిని పురావస్తు శాఖ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పురాతన వస్తువులు, నాణేలు లభిస్తే సంబంధిత అధికారులకు అప్పజెప్పాలని, వాటిని అక్రమంగా దాచుకోవడం నేరమన్నారు. సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, జూలపల్లి ఎస్ఐ సనత్ కుమార్ పాల్గొన్నారు.

మామిడిపల్లిలో పిచ్చికుక్క దాడి.. ముగ్గురికి గాయాలు

కోనరావుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కొల్లేరు హనుమన్లు, మాసం నర్సయ్యపై కుక్క దాడి చేసింది. నిజామాబాద్ గ్రామానికి చెందిన ఓ మహిళ మామిడిపల్లికి బంధువుల ఇంటికి వస్తున్న సమయంలో ఆమెను కూడా గాయపరిచింది. మరిమడ్ల గ్రామానికి చెందిన నరసయ్య కూడా పిచ్చికుక్క దాడిలో గాయపడ్డాడు. వీరందరికీ కోనరావుపేటలో ప్రభుత్వ దవాఖానాలో మండల వైద్యాధికారి వేణుమాధవ్ చికిత్స అందించారు.

రొట్టమాకురేవు కవిత్వ అవార్డులకు కవుల ఎంపిక

త్వరలో అవార్డుల ప్రదాన సభ



రొట్టమాకురేవు కవిత్వ అవార్డుల బ్రోచర్

కారేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పన్నెండు సంవత్సరాలుగా తన తండ్రి షేక్ మహమ్మద్ మియా స్మృత్యర్థం కవులను కవిత్వ అవార్డులకు ఎంపిక చేస్తున్నామని, ఈ ఏడాది కూడా కవుల ఎంపిక జరిగిందని, త్వరలోనే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించ బోతున్నట్టు ప్రముఖ కవి షేక్ యాకుబ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 నుంచి 2024వరకు వెలువడిన కవితాసంపుటుల నుంచి నాలుగు కవితాసంపుటులను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిందన్నారు.

వాటిలో సిరిసిల్లకు చెందిన నాగిళ్ల రమేష్ రచించిన వల్లకొడిసె వన్నెకాడు, హైదరబాద్‌కు చెందిన జూపాక సుభద్ర రచించిన తెలంగాణి కైతల దొంతులు, మహబూబాబాద్‌కు చెందిన రహిమొద్దీన్ రచించిన కలలరంగు, ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన కంచరాన భుజంగరావు రచించిన నీటి గింజలు కవితా సంపుటిలను ఎంపికయ్యాయయన్నారు. వారికి తన తండ్రి షేక్ మహమ్మద్ మియా, తన గురుసమానులైన మాజీ ఎమ్మెల్యే కేఎల్ నరసింహారావు, తన మామ పురిటిపాటి రామిరెడ్డి పేరిట ఈ వార్డులను అందజేయనున్నామని, త్వరలోనే ఈ కార్యక్రమం వివరాలు వెల్లడిస్తామని యాకూబ్ తన ప్రకటనలో తెలిపారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు సహకరించండి

- ఎన్నికల అధికారి, డీసీవో మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో మనోజ్‌కుమార్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు సాఫీగా సాగేందుకు డైరెక్టర్లుగా పోటీచేస్తున్న అభ్యర్థులు, సభ్యులు, బ్యాంక్ సిబ్బంది సహకారం అందించాలని ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్.మనోజ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక అర్బన్ బ్యాంకు ప్రధానశాఖ కార్యాలయంలో పాలకవర్గ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పి.శివ నాగేందర్‌రెడ్డి, కె.వంశీకృష్ణ, ఎ.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు ఫిర్యాదు

శంకరపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన నూనె పద్మ అనే మహిళ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి గ్రామ పంచాయతీ కార్యదర్శికి డబ్బులు ఇచ్చినట్లు ఆరోపిస్తూ ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా విచారణ జరిపి నిజనిర్ధారణ జరిగాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా తాను ఎవరి వద్ద నుంచి డబ్బులు తీసుకోలేదని తెలిపారు.

బాలికలకు ఏదీ భద్రత?

(5వ పేజీ తరువాయి)

కూడా పోక్సో కేసు నమోదు చేస్తారని చెబుతున్నారు. కలెక్టర్, పోలీసు కమిషనర్ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో జరిగిన అమానవీయ ఘటన వెలుగులోకి రావడంతో విద్యార్థులతో తల్లిదండ్రులతోపాటు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాఠశాల ఎదుట, గంగాధర మండల కేంద్రంలో ఆందోళన నిర్వహించారు.

● సంఘటనపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి ఆరా

ఈ సంఘటన విషయమై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కలెక్టర్, పోలీసు కమిషనర్‌తో మాట్లాడాడు. విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం అయినందున కేసును జాగ్రత్తగా, సమగ్రంగా దర్యాప్తు చేయాలని, అటెండర్ యాకూబ్‌భాషాతోపాటు ఇతరులెవరి ప్రమేయం ఉంటే వారిపైన కూడా పోక్సో కేసు నమోదు చేసేందుకు వెనుకాడవద్దని సూచించారు. విద్యార్థినుల తల్లిదండ్రులకు భరోసా కల్పించేందుకు అధికారులు నిమగ్నమయ్యారని అన్నారు.

రైసుమిల్ యజమానికి నోటీసులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మానకొండూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైసుమిల్లుల నుంచి మురుగు నీరు అనే శీర్షికన ఈ నెల 27న 'ఆంధ్రజ్యోతి' ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం మానకొండూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి శ్రీ అంజనీ పారాబాయిల్డ్ యజమానికి పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 87 ప్రకారం రూ. 5వేల జరిమానా విధిస్తూ నోటీసు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఈ- టెక్నో పాఠశాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నిష్ణాతులైన వ్యాయామ ఉపాధ్యాయులతో క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు శివన, విశ్వం, అభిరామ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకావడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎఫ్‌డీపీ ప్రోగ్రాం

తిమ్మాపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసిటిఈ)మద్దతుతో నిర్వహించే అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ఆన్‌లైన్ ప్రోగ్రాంను మంగళవారం ప్రారంభించినట్లు శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రోగ్రాం నవంబరు 1వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఐటి ధారవాడ ప్రొఫెసర్ డాక్టర్.కె.వి.జై కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూకంపాలు, వరదలు, వాతావరణ మార్పుల వంటి విపత్తుల ప్రభావాన్ని తగ్గించడానికి స్మార్ట్ టెక్నాలజీ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విభాగాదిపతి ఎం.శ్రీరామ్‌చంద్, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల ఇంజనీరింగ్ కళా శాల నుంచి ఆన్‌లైన్‌లో 150పైగా అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో మానేరు విద్యార్థి ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లాలోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. పాఠశాలకు చెందిన మహ్మద్ సాకీబ్ కరీంనగర్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సాకీబ్‌ను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, జహేద, తిరుపతి, స్వామి అభినందించారు.

వెలిచాల ప్యానల్‌కు సంఘీభావం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్యానల్‌కు ఇదివరకే నామినేషన్లు వేసి బరిలో నిలిచిన ఇద్దరు మంగళవారం సంఘీభావం ప్రకటించారు. ధరణికోట దామోదర్, యాగండ్ల రవి ఇటీవల అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేశారు. ధరణికోట దామోదర్, యాగండ్ల రవి ముందుకొచ్చి వెలిచాల రాజేందర్ సమక్షంలో నిర్మల భరోసా ప్యానల్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. వీరితోపాటు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దిండిగాల మధు మద్దతు ప్రకటించారు.

ఆటిజం పిల్లలకు రిహాబిటేషన్ సెంటర్లు ఉపయోగకరం

సుభాష్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటిజం పిల్లలకు రిహాబిటేషన్ సెంటర్లు ఎంతో ఉపయోగకరమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన అశోక్ రిహాబిటేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఆటిజం నిర్మూలనకు కృషి చేయాలని నిర్వాహకులకు సూచించారు. సెంటర్ నిర్వాహకుడు డాక్టర్ రాహుల్ గుల్వే, డాక్టర్లు నవిత, సచిన్ గాల్వే, కిరణ్‌కుమార్‌గుల్వే తదితరులు పాల్గొన్నారు.

గునుకుల కొండాపూర్‌లో ఉపాధిహామీ గ్రామసభ

గన్నేరువరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించేలా నూతన పనులను ఎంపిక చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రాజేష్ తెలిపారు. ఉపాధిహామీ పనుల్లో వ్యవసాయ పొలాలకు మట్టి రోడ్డు నిర్మాణాలు, పశువుల పాకలు, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ హనుమాండ్ల యాదగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనుకయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తీగలగుట్టపల్లిలో ఛత్‌పూజ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని తీగలగుట్టపల్లి రెండవ డివిజన్‌లో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మహిళలు మంగళవారం ఛత్ పూజ నిర్వహించారు. బతుకమ్మ కుంట వద్ద పూజ వేడుకలను చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య పరీక్షల వివరాలు నమోదు చేయాలి

● కలెక్టర్ పమేలా సత్పతి


పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణాలకు సంబంధించిన వైద్యశిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అలింకో సహకారంతో నిర్వహించిన దివ్యాంగులకు వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి వారి గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సీడీపీవో శ్రీలత ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా వైద్య పరీక్షల గురించి కలెక్టర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు కచ్చితంగా నాలుగు ఏఎన్‌సీ పరీక్షలు అయ్యేలా చూడాలని తెలిపారు. సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్యాధికారి వెంకటరమణ వైద్యులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య బేస్ క్యాంపు ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిన్న జీయరుస్వామి ఆశీస్సులతో వికాసతరంగిణి మహిళా ఆరోగ్య వికాస్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో ముఖరంపురలోని ఆండాళ్‌భవనంలో మంగళవారం ఉచిత మహిళా ఆరోగ్య బేస్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవ అధ్యక్షుడు, చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ శిబిరాల నిర్వహణకు వికాసతరంగిణికి పూర్తిగా సహకరిస్తామని, గతంలో 170 నుంచి 180 శిబిరాలు ఆసుపత్రి ద్వారా నిర్వహించామని తెలిపారు. కరోనా కారణంగా అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రతీ నెల 2వ, 4వ ఆదివారాలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ ప్రదేశాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజ్ఞావికాస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, మహిళా ఆరోగ్య వికాస్ ఇన్‌చార్జ్ మాధవీ రవీంద్ర, గౌతమరావు, శ్రీమతి, అరుణ, విజయ, యాద కిషన్, అశోక్‌రావు పాల్గొన్నారు.

బాల సదన్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ పట్టణంలోని బాల సదన్, శిశుగ్రహాలను సందర్శించారు. ఆహార పదార్థాలను నిలువచేసే గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదువుకుని ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. పిల్లలు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, శిశు గ్రుహలోని పిల్లల ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లలకి పండ్లను పంపిణీ చేశారు. ఎలాంటి న్యాయపరమైన లేదా న్యాయ సేవ అవసరమైన సంప్రదించాలని సిబ్బందిని ఆదేశించారు.

హరీష్‌రావు తండ్రి మృతికి సంతాపం

హుజూరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ మృతికి హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మంగళవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రైతు సంఘాల జేఏసీ జాతీయ నాయకుడు పోలాడి రామారావు సంతాపం వ్యక్తం చేశారు.

అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే


వేడుకలను ప్రారంభిస్తున్న ఎస్‌యూ రిజిస్ట్రార్ రవికుమార్, కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే డ్రీమోర-2025 పేరిట నిర్వహించిన వేడుకలు అలరించాయి. మంగళవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన వేడుకలను ఎస్‌యూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు అల్ఫోర్స్ కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శ నలు ఆకట్టుకున్నాయి.

సంక్షిప్తంగా..

చొప్పదండి : మండలంలోని పెద్ద కుర్మపల్లి లో ఆర్నకొండ-గోపాల్‌రావుపేట రోడ్డుపై గుంతలను గ్రామ కార్యదర్శి సల్మాన్ ట్రాక్టర్లతో మట్టి తెప్పించి పంచాయతీ కార్మికులతో పూడ్చివేశారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌లో గాలికుంటు పశు వైద్య శిబిరాన్ని పశు సంవర్ధకశాఖ ఏడీ వినోద్ కుమార్ ప్రారం భించారు. పశువైద్యాధికారి శశికాంత్ రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

చిగురుమామిడి: సుందరగిరి మాజీ ఎంపీటీసీ మేడ బోయిని తిరుపతికి ఇటీవల ప్రమాదశాత్తు కాలుకు విరిగింది. మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, నాయకులు ఉన్నారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతా మందిరంలో చాతుర్మాస భగవన్నామ కోటి మహా జప యజ్ఞం మంగళవారంతో కోటి సంఖ్యకు చేరుకుంది.

కరీంనగర్ టౌన్ : వీణవంక మండలం బొంతుపల్లికి చెందిన నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన నవ్య వివాహానికి కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్య క్షుడు నగునూరి రాజేందర్ దాతల సహ కారంతో పుసెమట్టెలు, చీరను అందజేశారు.

సైదాపూర్: సైదాపూర్ మండలంలోని పెర్కపల్లి, గొల్లగూడెంలో మంగళవారం 245 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యా దికారి డాక్టర్ సీహెచ్ విజేందర్ రావు అన్నారు. రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించడంలో అలసత్వం వద్దన్నారు.

జమ్మికుంట: జీవశాస్త్ర రంగంలోని మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభా గాధిపతి డాక్టర్ గణేష్ అన్నారు. మంగళవారం జమ్మికుంటలోని ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఓదెలు కుమార్ అధ్యక్షతన జీవ శాస్త్రంలో నూతన ఆవిష్కరణలపై జాతీయ సదస్సు నిర్వహించారు.

బండిసంజయ్‌ని సన్మానించిన గ్రామస్థులు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం పాపయ్యపల్లి గ్రామస్థులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాల్వాతో ఘనంగా సన్మానించారు. గ్రామంలోని సమస్యలను ఆయనకు వివరించగా సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ ప్లాంట్ చైర్మన్ సంజీవరావు, రాములు, రాకేష్, రాజు, అశోక్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


నగునూర్‌లో ప్రారంభిస్తున్న పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం, దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో మంగళవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నగునూర్, చెర్లబూత్కూర్ జూబ్లీనగర్‌లో సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బీరం అంజనేయులు, డైరెక్టర్‌లు గంట శంకరయ్య సాయిల్ల మహేందర్, చేవేళ్ళ గంగయ్య, సీఈవో రమేష్, కార్యదర్శి కిరణ్ రావు, ఆయా గ్రామాల నాయకులు దబ్బెట రమనారెడ్డి , కూర శ్యాంసుందర్ రెడ్డి, నరేష్ రెడ్డి, నరహరి ప్రవీణ్, రుద్ర రాము, మునిరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చేగుర్తి, మొగ్దుంపూర్ గ్రామాల్లో సంఘం అధ్యక్షుడు తోట తిరుపతి కేంద్రాలను ప్రారంభించారు. సీఈవో వేణు, డైరెక్టర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

చామనపల్లిలో జూబ్లీనగర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో సంజీవరావు ప్రారంభించారు. మండల పంచాయతీ అధికారి జగన్మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేందర్ రావు, ఐకేపీసీసీ రాజేశం, నాయకులు పాల్గొన్నారు.

సర్దార్ యూనిటీ మార్చ్‌ను విజయవంతం చేయాలి


హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31న కరీంనగర్‌లో జరిగే సర్దార్ యూనిటీ మార్చ్ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని శిశు మందిర్‌లో సర్దార్ ఐక్యత మార్చ్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సంద ర్భంగా కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుంచి టవర్ సర్కిల్ వరకు సర్దార్ ఐక్యత మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మానికి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయ వంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాజు, వేణు, శ్రీనివాస్, రాజు, రమేష్, వాసు,

మన్నెంపల్లి శివాలయం కమిటీ

తిమ్మాపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెంపల్లిలోని పురాతన శివాలయానికి సంబంధించి కాంగ్రెస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా మేడి అంజయ్య, డైరెక్టర్లుగా రావుల శ్రీనివాస్ గౌడ్, సానగొండ నర్సింహస్వామి, మారకొండ వెంకటేశ్వర్లు, దుర్గం మధునయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్య క్షులు జేజేల సంపత్ ఆధ్యక్షతన జరగగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.ఎల్.గౌడ్, మండల ఉపాధ్యక్షులు తూముల శ్రీనివాస్, నాయకులు నాంపెల్లి అంజనేయులు, సానకొండ సంపత్, పరుశరాములు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలి

హుజూరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం వంగర గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని శ్రీవర్షిత ఆత్మ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకుడు చైతన్య అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థిని మృతికి వంగర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది కారణమన్నారు. వారిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి


రైతునేస్తం వీక్షిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

కరీంనగర్ రూరల్; అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో మెళకువలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వ్యవసాయ సంచాలకులు డాక్టర్ గోపి, ===లీ బాయి. అదనపు సంచాలకులు లక్ష్మణుడు, సీసీఐ వరంగల్ సీనియర్ మేనేజర్ ఉమాంగ్, మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ విష్ణు వరద్దన్ వ్యవసాయ శాఖ పీజీటీఏయూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. కపాస్ కిసాన్ యాప్, పత్తి కొనుగోళ్లపై, వానాకాలం మొక్కజొన్న కొనుగోళ్లు, శాస్త్రవేత్తలతో పరస్పర చర్చను నిర్వహించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సాగులో జాగ్రత్తలు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని, అధిక దిగుబడి సాధించాలని అన్నారు. ఏఈవో స్వర్ణలత, రైతులు పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గణేష్

గణేశ్‌నగర్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): యూఎస్‌ఎఫ్‌ఐ (భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా కార్యదర్శి సంద గణేష్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన యూఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను చేపడతామని, సంఘం బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర మహాసభల్లో కరీంనగర్ జిల్లా ఆఫీస్ బేరర్‌గా పనిచేస్తున్న నాయకులు అల్లెపు అభిలాష్, బూస మనితేజ, హిమంత్‌వాణి, రాణి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలోనే అత్యధిక అడ్మిషన్లు చేపట్టాం

గణేశ్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం రాష్ట్రంలోనే అత్యధిక అడ్మిషన్లు చేపట్టామని ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ తెలిపారు. కళాశాలలో సోమవారం నాలుగో అకాడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి అటానమస్ డిగ్రీ బ్యాచ్ పరీక్షల ఫలితాలు ఉత్సాహకరంగా ఉన్నాయన్నారు. సమావేశ, అటానమస్ సమన్వయకర్త డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో కళాశాల నిర్వహించిన పలు కార్యక్రమాలను వివరించారు. అనంతరం తీర్మానాలను ఆమోదించారు. కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ నితిన్, రాజయ్య పాల్గొన్నారు.

రక్తదానం

సుభాష్ నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన గుర్రం ఆగయ్య(70) అనారోగ్యంతో బాధడుతుండగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆయనను పరీక్షించిన డాక్టర్లు గుండె ఆపరేషన్ చేయాలని సూచించారు. ఓ నెగిటీవ్ గ్రూపు రక్తం అవసరమువడంతో బీజేపీ నాయకుడు బేతి మహేందర్‌రెడ్డి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 31 ఏళ్లుగా రక్తదానం చేస్తున్నట్లు, 67వ సారి చేసినట్లు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

జమ్మికుంట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయం ఆవరణలో గోవిందాంబ సమేత శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి మంత్రశిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కరపత్రాన్ని విశ్వబ్రాహ్మణ కులస్థులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు అకారపు రమేష్, విశ్వకర్మ కార్పెంటర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూ నవంబర్ 8నుండి 10వ తేదీ వరకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

జనం బాటను విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత జిల్లాలో చేపట్టనున్న జనం బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్ సింగ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక హోటల్‌లో జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్‌తో కలిసి జాగృతి జనం బాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాగృతి వ్యవస్థాప కురాలు కవిత ఈనెల 31, నవంబరు 1న రెండు రోజులు జిల్లాలో పర్యటిస్తారని, మొదటి రోజు హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల్లో పర్యటించి కరీంనగర్‌లో రాత్రి బస చేస్తారన్నారు. రెండో రోజు జిల్లా కేంద్రంలో అనేక రంగాల నిష్ణాత్నులతో సమావేశమై, జనం బాట చేపట్టడానికి తీసుకున్న నిర్ణయాన్ని స్పష్టం చేస్తారన్నారు. జాగృతి సభ్యులు అక్కం శివరాణి, మేకల తిరుపతి, పెండ్యాల మహేశ్, చంటి శ్రీనివాస్, శ్రీరాముల రమేశ్, ఎం.ఎ.రాజీ, రమణాచారి, కుతాడి శ్రీనివాస్, కొండ రవి, సంగీతారెడ్డి, మంజుల భార్గవి, అపర్ణ, రూప, రోజారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలి


సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న ఏసీపీ మాధవి

కరీంనగర్ క్రైం/హుజూరాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):: ప్రతి ఒక్కరూ తమ జీవితంలో వ్యాయామం చేయాలని హుజూరాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్‌లోని పోలీసులతో పాటు పట్టణంలోని పలువురు ర్యాలీగా పాల్గొనగా ఏసీపీ మాధవి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ వ్యాయామంతో ఎటువంటి రుగ్మతలనైనా తగ్గించుకోవచ్చన్నారు. వ్యాయామం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుందన్నారు. అలాగే ఈ నెల 30న మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ప్రతి ఒక్కరూ పెద్దఎత్తున హాజరై రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, వెంకట్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఎస్‌ఐలు యూనస్‌అహ్మద్‌అలీ, తిరుపతి పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం కొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో స్థానిక పాఠశాలల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాలు, కేసులు, ప్రమాదాలు, విచారణ, ఎఫ్‌ఐఆర్ తదితర అంశాలపై కొత్తపల్లి సీఐ కోటేశ్వర్ అవగాహన కల్పించారు. షీ టీం, సైబర్ క్రైం పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ విభాగానికి సంబంధించి వివరించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశంతో ఈ నెల 31వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.